అచ్యుతరామారావు వార్ధక్యం

కాళూరి హనుమంతరావు

సామానంతా కట్టడమయింది. పెట్టెలు, బెడ్డింగులు, టేబుళ్ళు, కుర్చీలు, రేడియో, ఫేను, జాడీలు, సీసాలు, మంచాలు, బుట్టలు, పుస్తకాలు, పాత్ర సామాను వేసి కుట్టి పెట్టిన గోనెసంచులు, బోయిలరు, డబ్బాలు, అవీ ఇవీ, అబ్బ! ఎంత సామానుందీ! ఇలా కట్టి పరచిన సామానే రెండు గదులని ఆక్రమించి వుంది. పన్నెండేళ్ళయి ఆ ఇంట్లో పాతుకు పోయి వున్నాడు ఇప్పుడా ఇల్లు ఖాళీ చేసి ఇంకొక చిన్న ఇంట్లోకి వెళ్తున్నాడు అచ్యుతరామారావు ఈ సామానంతా ఆ క్రొత్త యింట్లో పడుతుందా? ఒకవేళ సామానుని కష్టపడి ఎలాగో యింట్లో ఇరికించినా ఇక తా ముండడానికి చోటుం టుందా?

అయినా తా మెందరు కనుక? తానూ కూతురు శారదా యిద్దరే కదా!

హుస్సేన్ బళ్ళు పిల్చుకొని వచ్చాడు. శారద పనిచేస్తున్న ఆఫీసులో హుస్సే నొక బంట్రోతు సామాను కట్టడానికీ, కొత్త ఇంట్లో అమర్చడానికీ వాణ్ణి శారద పిలిచింది హుస్సేన్ మూడు బళ్ళు పిల్చుకుని వచ్చాడు ఆ బళ్ళు చాలవనీ, రెండు ట్రిప్పులు వెయ్యవలసి వుంటుందనీ అచ్యుత రామారావు తలచాడు.

"చూసుకోండయ్యా, సామాను. ఈ సామానంతా నల్లకుంట చేరవెయ్యాలి ఏం బేరం చెబుతారో చెప్పండి" అన్నాడు హుస్సేను బళ్ళవాళ్ళతో బేరం సాగి చివరికి ఇరవై కి కుదిరింది

బళ్ళవాళ్ళు సామాను బళ్ళ మీద జమాయించడం ప్రారంభించారు. పెట్టెలు, వాటి మీద పరుపుచుట్టలు, ప్రక్క ప్రక్కన డబ్బాలు, వాటి మీద కుర్చీలూ టేబుళ్ళూ, వాటి మీద మంచాలు—ఇలాగ సామా

నంతా మూడు బళ్ళలో ఇరికించి సర్ది తాళ్లు వేసి బిగించి కట్టారు. అచ్యుతరామారావు ఆశ్చర్యపోయాడు ఆరు బళ్ళనుకొన్నది మూడు బళ్ళలో పట్టేసింది. అంతే మరి కుదించుకు పోవడం, ఇరుక్కు పోవడం నేటి జీవనధర్మం!

బళ్ళు కదిలాయి. వాటిని అనుసరించి హుస్సేన్ సైకిల్‌మీద వెళ్ళాడు రిక్షాలో తానూ కూతురూ బయలుదేరారు. వెళ్తూ బళ్ళను చూశాడు అచ్యుతరామారావు. మూడు కదులుతున్న కొండల్లాగ ఉన్నాయి. మూడు అంబారీ కట్టిన ఏనుగులు లాగ వున్నాయి. ఎడ్లు అమిత భారాన్ని లాగుతున్నాయి తలకు మించిన బరువుతో ఎడ్లు కటకట లాడుతున్నాయి. అయినా సాధ్యమైనంత తొందరగా గమ్యాన్ని చేరే ధీమాతో లాగుతున్నాయి.

తానూ తన జీవితంలో అంతే చేశాడు అచ్యుతరామారావు తలకు మించిన భారాన్ని లాగాడు తన సంపాదనకు మించిన స్థాయిలో కుటుంబాన్ని నడిపాడు, అచిరకాలంలో దానికి తగిన ఫలితాన్ని పొందగలననే ధైర్యంతో.

అచ్యుతరామారావు ఇరవై ఏళ్ళ క్రితం స్కూలు మాష్టరుగా హైదరాబాదు వచ్చి, హెడ్‌మాష్టరయి ఇటీవల రిటైరయాడు. పెద్ద కూతురికి చాలాకాలం క్రితమే పెళ్ళి చేశాడు. కట్నమూ అవీ చాలా యెక్కువే ఇచ్చాడు. అల్లుడు ఇంజినీరు వాళ్ళు విజయవాడలో వుంటున్నారు. పెద్దకొడుకు లా పాసయి ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కొడుకు ఎమ్ ఎస్‌సి. పాసయి రెండేళ్ళు యూనివర్శిటీలో పని చేశాడు. అప్పుడే అతనికి పెళ్ళయింది పెళ్ళాన్ని వాళ్ళ పుట్టింట్లో వుంచి పై వదువుకి ఫ్రాన్స్ వెళ్ళాడు రెండో కూతురు శారద బి ఎస్. సి పాసయింది ఎక్కువ మార్కులు రానందున ఎమ్ ఎస్‌సి లో సీటు రాలేదు. బి ఇడి చదవనంది క్రొత్తగా ప్రారంభమయిన ఒక కెమికల్ ఫేక్టరీలో అసిస్టెంట్ కెమిస్ట్‌గా చేరింది

పైకింత హోదాగా బాగా కనిపిస్తున్నా కొంచం లోపలికిపోయి చూస్తే అతని సంసారంలో చాలా లోటుపాట్లు కనిపిస్తాయి అతనికి ఆస్తిపాస్తులేవీ లేవు. ఇరవై ఏళ్ళయి వుంటున్నా హైదరాబాదులో స్వంతంగా యిల్లు కట్టించుకోలేదు సరికదా, స్థలమైనా కొనుక్కోలేదు. ఇష్టంలేకకాదు, శక్తిలేక పెద్ద కూతురు పెళ్ళికి పిత్రార్జితం అయిపోయింది నెల నెలా వచ్చిన జీతమేకాక ప్రోవిడెంట్ ఫండ్‌లో కొంత భాగం కూడా పిల్లల వదువుల కయిపోయింది. పెద్ద కొడుక్కి పెళ్ళాం, ఇద్దరు పిల్లలతో ఢిల్లీలో అతని జీతం అతనికే బొటాబొటిగా సరిపడుతుంది రెండో కొడుకు హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నన్నాళ్ళూ తన కుంటుంబ స్థితి బాగుంది అతను పై చదువులకి ఫ్రాన్స్ వెళ్ళాక పరిస్థితి కుంటుపడింది. తనకు ఎంతకష్టమైనా కొడుకు ఆశయానికి

అర్హతగల తలచుకోలేదు అచ్యుతరామా రావు తాను రిటైరవుతున్నాడు, కొడుకు తన దగ్గరే వుండి సంసారాన్నాదుకొంటే తన బాధ్యతలు తీరిపోయి, చివరి రోజులు చల్లగా వెళ్ళిపోతాయి ఇది తన ఉద్దేశం కావచ్చును కాని తన కొడుక్కి అతని ఆశలు అతని కుంటాయి ఇక్కడుంటే తన రిసెర్చి బాగా సాగడం లేదు. ఫ్రాన్స్ వెళ్ళి మూడేళ్ళలో పిహెచ్. డి అయి తిరిగివస్తే ఇక తిరుగుండదు కేవలం డబ్బు, సంసార సుఖం వీటి దృష్టితోనే ప్రతివిషయాన్నీ చూడకూడదు ఎవరి జీవి తాశయాలూ, ఆశలూ వారివి. ఏముంది! కాలం గిరగిర తిరిగి మూడేళ్ళైటే గడు స్తాయి. అసలు కొడుకులు పెద్దవాళ్ళు కావ లనీ, పేరు ప్రఖ్యాతులు గడించుకోవాలనే తాను తన స్థాయికి మించిన విధంలో జీవిత ప్రవాహానికి ఎదురీది వాళ్ళను చదివించాడు ఇంతవరకూ వాళ్ళని తెచ్చి చివరిదశలో ఇప్పుడు నీళ్ళు కారుతే ఏం ప్రయోజనం? కనుక కొడుకు ఫ్రాన్స్ వెళ్ళడాన్ని అచ్యుత రామారావు సమర్థించాడు

రెండవ కొడుకు ఫ్రాన్స్ వెళ్ళి రెండే ళ్ళయింది తాను రిటైరయాడు శారద ఉద్యోగంలో చేరింది. నిజానికి శారద ఉద్యోగంలో చేరడంకన్నా ఇప్పుడాయనకు గత్యంతరంలేదు. పూర్వపు ఇల్లు అద్దె ఎక్కువని • ఖాళీ చేసి, చిన్న యిల్లు తీసు కొన్నాడు.

అచ్యుతరామారావు భార్య పద్దెనిమిది సంవత్సరాల క్రితం చనిపోయింది. అది అతని జీవితంలో పెద్ద ఆఘాతం కాని అతను మనోధైర్యంతో ఆ ఆఘాతాన్ని సహించాడు. అప్పటికతని వయస్సు నలభై సంవత్సరాలు అతనికి రెండో పెళ్ళికి సంబంధాలు వచ్చాయి. కాని తన పిల్లల విషయంలో తనకు చాలా గొప్ప, పవిత్ర మైన బాధ్యత ఉందనీ, వాళ్ళను చక్కగా పెంచి యోగ్యులను చెయ్యడమే తన కర్తవ్యమనీ, రెండో పెళ్ళి చేసుకొంటే సవతి తల్లి హయాంలో తన పిల్లలకు అన్యాయం జరగవచ్చుననీ భావించి అతను రెండో పెళ్ళి చేసుకోలేదు. తన వైవాహిక జీవిత సౌఖ్యాన్ని పిల్లలకోసం త్యాగం చేసి తల్లీ తండ్రీ తానే అయి పిల్లలను పెంచి పెద్ద చేశాడు

రెండో కొడుకు ఫ్రాన్స్ వెళ్ళి దాదాపు మూడేళ్ళయింది అతని రాకకోసం అచ్యుత రామారావు తహతహ పడుతున్నాడు అతను వచ్చేసి ఎక్కడైనా ఉద్యోగంలో కుదురుకుంటే ఇక తన బాధ్యతలన్నీ తీరి పోతాయి ఎలాగో కష్టపడి శారద పెళ్ళి చేసేస్తాడు అది తన ఆఖరి బాధ్యత. అది తీరిపోతే ఇంక తన వార్ధక్యం ప్రశాంతంగా వెళ్ళిపోతుంది. ఆ తరువాత కొంతకాలం జీవించినా సంతోషమే, మరణించినా సంతోషమే.

ఈ ప్రణాళిక కంతటికీ ఆధారం రెండో కొడుకు. ఇంకో మూడు నెలలకి వస్తాడనగా అతడు ఉత్తరం వ్రాశాడు. తన రిసెర్చి బాగా నడిచిందనీ, రెండు నెలలలో పిహెచ్ డి. పూర్తవుతుందనీ, కాని తిరిగి వచ్చాక ఇండియాలో తనకు తగిన ఉద్యోగం దొరుకుతుందా అని సందే హిస్తున్నాననీను. అతను వ్రాసింది నిజమే. ప్రస్తుతం ఇండియాలో ఉద్యోగాల స్థితి బాగులేదు అందుచేత విదేశాలకి వెళ్ళి చదువుకొన్న వాళ్ళు అక్కడే ఉద్యోగాలు తెచ్చుకొని ఉండిపోతున్నారు

కొంపతీసి తన కొడుకు కూడా అలాగ చెయ్యడు కద! అని ఏ ముహూర్తాన అచ్యుతరామారావు భయపడ్డాడో, ఆ భయం నిజమయింది ఇక్కడ నాకు మంచి ఉద్యోగం దొరికింది, కనుక నే నింకా కొంతకాలం ఇక్కడే వుంటాను అని పిహెచ్ డి పట్టం పుచ్చుకొన్నాం కొడుకు ఉత్తరం వ్రాశాడు. ఈ ఉత్తరంతో అచ్యుతరామారావు ధైర్యం జీవితంలో మొదటిసారిగా సడలిపోయింది ఎవరిమీద తన ఆశలు కేంద్రీకరించుకొన్నాడో ఆ రెండోకొడుకు తనకు వేళకు చేయూత నియ్యకమృగతృష్ణవలె కనిపిస్తున్నాడు తన పరిస్థితినీ, శారదకు సాధ్యమైనంత త్వరలో పెళ్ళి చెయ్యవలసిన బాధ్యతనూ వివరిస్తూ త్వరలో తిరిగి రమ్మని కొడుక్కి ఉత్తరం వ్రాశాడు. నెల రోజుల తర్వాత జవాబు వచ్చింది.

"నే నిక్కడొక ఫ్రెంచి స్త్రీని పెళ్ళి చేసుకొంటున్నాను. నా కిక్కడే అంతా



బాగుంది కనుక ఇప్పట్లో ఇండియాకి రాను" అని కొడుకు ఉత్తరం వ్రాశాడు అచ్యుతరామారావుకి నాలుగైదుసార్లు చదివిన తర్వాతగాని ఆ ఉత్తరం అర్థంకాలేదు గాలివానకు పూరిపాక కూలిపోయినట్లుగా కూలిపోయాడు కొడుకు వ్రాసిన ఉత్తరం చదివి.

"ఇలాటి పని చెయ్యొచ్చునా! ఇక్కడ నీకు పెళ్ళాం వుంది నువ్వెప్పుడొస్తావా అని నా కన్నా ఎక్కువ ఆతురతతో ఎదురు చూస్తోంది ఆమె గతేంకాను? ఇప్పుడు నువ్వక్కడ ఫ్రెంచి స్త్రీని పెళ్ళిచేసుకోవడమేమిటి? కనుక ఇటువంటి పనిచెయ్యక వెంటనే తిరిగివచ్చెయ్యి" అని కొడుక్కి వ్రాశాడు

"మీరు నా గురించి విచారించకండి. ఇక్కడ నేను ప్రస్తుతానికి సెటిల్ అయిపోయాను. అక్కడ మా ఆవిడని ఇంకెవరికైనా పెళ్ళి చేసుకోమని సలహా ఇస్తూ ఉత్తరం వ్రాశాడు. అంతగా ఇండియాలో ఆమెకు మళ్ళీ పెళ్ళిచెయ్యడం కష్టమయితే ఆమెను ఇక్కడికి పంపండి ఇక్కడామెకు నేను మరో మొగుణ్ణి కుదురుస్తాను" అని కొడుకు జవాబు వ్రాశాడు

నలుగురు పిల్లల్ని వదిలి తన భార్య చనిపోయినప్పుడైనా అచ్యుతరామారావు క్రుంగలేదు తాను ఎంతో గారాబంగా ఎత్తుకొని తిప్పిన కొడుకేనా వీడు? గోడకి అతని ఫొటో వ్రేలాడుతోంది ఎంత స్నిగ్ధంగా, మనోహరంగా కనిపిస్తున్నాడు

పైకి! చివరకు మాయలేడిలా తనను వంచించాడు

పెద్దకొడుకు ఢిల్లీలో దూరంగా సంసార బాధ్యతలు తగులుకోకుండా, అప్పుడప్పుడు ఊరడింపు మాటలుమాత్రం వ్రాస్తూ తామరాకు మీద నీటిబిందువులె నిష్ప్రణంగా ఉంటున్నాడు ఇంకొక ఏడాది గడిచింది. శారదకి పెళ్ళి చెయ్యవలిసిన బాధ్యత దిగులుగా మారింది అచ్యుతరామా రావుకి. ఇన్నాళ్ళూ రెండో కొడుకు మీద ఆశపెట్టుకున్నాడు ఇప్పుడిక తానే పూను కోవాలి బాధ్యతలు తీరి నిశ్చింతగా కాలం గడపవలిసిన వయస్సులో తనకు క్రొత్త బాధ్యతలు ప్రారంభమయాయి సంబం ధాలు వెతుకుతున్నాడు తగినవి దొరకడం లేదు

శారదకి ఈ మూడు నాలుగేళ్ళలోనూ జీతం రెట్టింపుకి పెరిగింది. కాని పని చాలా హెచ్చు. అసలే ఫేక్టరీ ఉద్యోగం, పై పెచ్చు క్రొత్తగా ప్రారంభమయిన ఫేక్టరీ విపరీత మైన పని రాత్రయిపోతుంది కంపెనీ మేనేజరు తన కారులో ఆమెను ఇంటికి దిగబెడతాడు. ఆదివారాలు కూడా ఆమెకి పనే అంతరాత్రయాక పరాయి మొగ వాడితో కార్లో తిరిగిరావడం, అతిభారమైన ఆ ఉద్యోగం అదంతా అచ్యుతరామా రావుకి ఇష్టంలేదు "ఫేక్టరీలోనే ఆలస్యమై పోతుంది ఇంక అప్పుడు సిటీ బస్సులో రావడమైతే ఇంటికి వచ్చేసరికి ఇంకా ఆలస్యమవుతుంది. అంచేత తొందరగా మేనేజరుతో కార్లో వచ్చేస్తున్నాను" అంటుంది శారద

"ఫేక్టరీ పని చాలా కష్టమమ్మా! స్టేట్ బేంకులో నాకు తెలిసినాయన వున్నాడు. అందులో పని వేయిస్తాను అది చెయ్య కూడదూ?" అంటాడు అచ్యుతరామారావు కూతురుతో.

"ఇక్కడ నాలుగువంద లిస్తున్నారు. నాలుగేళ్ళయి పని చేస్తున్నాను. బేంకులో రెండువందలైనా యిస్తారో ఇవ్వరో! ఈ నాలుగేళ్ళ ఎక్స్‌పీరియన్సూ వృథా అయి పోతుంది ఈ ఉద్యోగమే మంచిది ఫేక్టరీ అభివృద్ధి చెందుతోంది" అంటుంది శారద

కూతురు సంపాదన మీద జీవించవలసి రావడం అచ్యుతరామారావుకు యిష్టం లేదు వేడి వేడి అన్నపుముద్దలు కాలిన ఇనపగుళ్ళలాగ మ్రింగుతున్నాడు. కూతు రుకి పెళ్ళి చేయలేక పోవడం అవమాన కరంగా వుంది కాని ఏం చేస్తాడు? అసలే సంబంధాలు లేవు ఒకటో రెండో దొరికినా శారద మూలంగా కుదరడం లేదు.

తాను పెళ్ళయాక కూడా ఉద్యోగం చేస్తుంది కనుక పెళ్ళి కొడుకు కూడా ఆ ఊళ్ళోవాడే అయివుండాలి అని ఆమె అభిమతం విజయవాడలో ఒక డాక్టరు, విశాఖపట్నంలో ఒక లెక్చెరరు, ఈ రెండు మంచి సంబంధాలూ యిలానే తప్పి పోయాయి హాయిగా మొగలిపువ్వు వంటి

మొగుడు వస్తూవుంటే కాదని ఈ వుద్యోగ వ్యామోహ మేమిటి ఈమెకు? మనిషికి డబ్బు మీద వుండే వ్యామోహం మహా చెడ్డది

ఎలాగైతేనేం హైదరాబాదులోనే ఉండే ఒక పెళ్ళికొడుకు కుదిరాడు బేంకులో పని చేస్తున్నాడు వయస్సు కొంచం ఎక్కువే ముప్పైఆరు ఈ పెళ్ళికొడుకు అచ్యుత రామారావుకి వ్యక్తిగతంగా నచ్చలేదు విశాఖపట్నంలో లెక్చెరరు చూడముచ్చ టగా వున్నాడు తా నెరిగిన మంచి సంప్ర దాయంకల కుటుంబం అన్నీ బాగున్నాయి ఈ పెళ్ళికొడుకు తా నెరిగినవాడుకాడు పైగా ఇతనిలో అప్పుడే వార్ధక్యలక్షణాలు కని పిస్తున్నాయి సగానికిపైగా బట్టతల కళ్ళ చుట్టూ నీలి చక్రాల ఛాయలు. ఈచబోయి నట్లున్నాడు. మన్మధుడి వంటి విశాఖపట్నం లెక్చెరర్ని కాదని శారద వీడిని అంగీకరిం చడం చూస్తే అతనికి ఆశ్చర్యంగా వుంది. కన్యావరయతే రూపమ్ అన్న ప్రాచీ నార్యోక్తి ఇన్నాళ్ళకు తన కూతురు విష యంలో అసత్యమయింది. ఇంతకీ తన కూతురు ఈ సంబంధాన్ని అంగీకరించ డానికి, ఇతణ్ణి పెళ్ళి చేసుకొంటే ఈ ఊళ్ళోనే ఉంటూ ఆ ఉద్యోగం చేస్తూ వుండవచ్చునన్నదే కారణం ఏమిటీ ఉద్యోగవ్యామోహం తన కూతురికి! ఉద్యోగ వ్యామోహం నేడు స్త్రీలలో స్త్రీ సహజలక్ష ణాలనే నిర్మూలింప జేస్తున్నది!

ఏమైతేనేం, పెళ్ళయిపోయింది తన బాధ్యత తీరిపోయిందనుకొని తృప్తి పడ్డాడు కాని రెండు నెలలలో పరిస్థితి విషమించింది

పెళ్ళికి ముందే శారద షరతు పెట్టింది, పెళ్ళయాక కూడా తాను ఉద్యోగం చేస్తానని. పెళ్ళికొడుకు ఒప్పుకొనే పెళ్ళి చేసుకొన్నాడు ఇటు సంసారం చేస్తూ అటు ఉద్యోగం చేసి డబ్బు గడించే భార్యని ఏ మొగవాడు ఇష్టపడకుండా వుంటాడు? కాని పొద్దున్నే ఏడుగంటలకి ఇల్లు విడిచి రాత్రి ఎనిమిది గంటలకి పరాయి మొగవాడితో కార్లో వస్తున్న తన భార్యను చూడగా చూడగా అతనికి అనుమానం, అసూయా కలిగాయి అతని తల్లి కూడా గొణుక్కోవడం మొదలెట్టింది "ఈవిడ రాణీలాగ పొద్దున్న వెళ్ళి రాత్రి వస్తుందట, నే నన్నీ అమర్చి పెట్టాలిట! కోడలు వస్తే ముసలి కాలంలో నాకు సాయపడుతుందనుకొన్నాను గాని ఇలా నెత్తెక్కుతుందనుకోలేదు." అంటూ.

"ఈ ఉద్యోగం మానేశెయ్. పని ఎక్కువ. మా బేంకులో ఒకటి ఖాళీ వుంది. అది నీకు వేయిస్తాను పదిగంటలకి వెళ్ళి ఐదు గంటలకి వచ్చేసేవచ్చు." అన్నాడు భార్యతో. తండ్రికి చెప్పిన జవాబే భర్తకీ చెప్పింది శారద. అతను నెమ్మదిగా ఆమె పని చేస్తున్న ఫేక్టరీ, దాని వ్యవహారాలూ, లోపలిగుట్టూ అంతా తనకి తెలిసిన వారి ద్వారా సంగ్రహించాడు అతనికి నిజం తెలిసిపోయింది

ఆ ఫేక్టరీలో ఆమెతోబాటు చేరినవారికి ఈ నాలుగేళ్ళలోనూ ఏభై అరవై రూపాయలకన్నా జీతం ఎక్కువ పెరగలేదు. ఛీఫ్ కెమిస్ట్‌కి కూడా నూట ఏభై రూపాయలు మాత్రం పెరిగింది ఒక్క శారదకి మాత్రం రెండువందలు పెరిగింది దీనికి కారణం ఆమె మేనేజర్‌కి భోగినికావడమే. ఆఫీసులో తక్కిన స్టాఫ్ కట్టెదుటే సరాగాలాడతారు అందరూ వెళ్ళిపోయాక గంట సేపు వీరిద్దరే వుంటారు ఆదివారాలు యధేచ్ఛగా విహరిస్తారు

"ఇదీ మీ కూతురు సంగతి ఇదివరకు ఇదంతా మీకు తెలుసునో తెలియదో నాకు తెలియదు కాని నాకు మాత్రం చాలా మోసం జరిగింది" అన్నాడతను మావఁగారితో. అచ్యుతరామారావు మొహంలో కత్తివాటుకి నెత్తురుచుక్కలేదు ఎంతో గౌరవంగా బ్రతికిన బ్రతుకు చివరికి యే దశకు వచ్చింది! తన భార్య అదృష్టవంతురాలు ఇదంతా చూడకుండా గౌరవంగా వెళ్ళిపోయింది తానెందుకిలా ఇన్నాళ్ళు జీవించి ఉన్నాడు? శివరాత్రి నాడు రాత్రంతా జాగరంచేసి తెల్లవారుతోందనగా కునుకుపాటుపడి జాగరాన్నంతటినీ పాడుచేసుకొన్నట్లుంది తన వార్ధక్యదశ

"అయినా నే నిప్పుడు మీతో పోట్లాడ్డానికి రాలేదు.ఏజ్ ఏ జెంటిల్‌మన్ వచ్చాను.



గతించిందేదో గతించింది ఇప్పటికైనా ఆమె ఫేక్టరీలో ఉద్యోగాన్నిమాని, బుద్ధిగా నడుచుకొంటే ఆమె గత చరిత్రనంతా మరచిపోయి విశాలహృదయంతో స్వీకరిస్తాను. లేకపోతే ముప్పై రెండు పళ్ళూ రాలగొడతాను" అన్నాడు మళ్ళీ అల్లుడు. అచ్యుతరామారావు తన కూతురుకి నచ్చజెప్ప చూశాడు

"ఆ రాలగొట్టడమేదో నేనూ చూస్తాను అంత అనుమానం మనిషైతే చదువుకొని ఉద్యోగం చేస్తున్న నన్నెందుకు పెళ్ళాడాలి? అందుకు తగిన దానినే చేసుకోవలసింది ఇలా హద్దుమీరి ప్రవర్తించాడంటే చెప్పుతీసి కొడతాను" అందామె తన పెట్టె బేడా తీసుకొని తండ్రి దగ్గరకు వచ్చేసింది

భర్తతో ఈ పోట్లాటలో మూడు రోజులు వరసగా శారద ఫేక్టరీకి వెళ్ళలేదు నాలుగోరోజు వెళ్ళేసరికి ఆమెకి ఆఫీసులో స్థానభ్రంశం కలిగింది అంటే ఆమె ఉద్యోగం పోయిందని కాదు. మేనేజరు ఒక చక్కని చుక్కను లేడీ స్టెనోను వేసుకొన్నాడు. ఇదివరకటి తన స్థానాన్ని ఇప్పుడామె ఆక్రమించుకొంది. పేరుకి స్టెనో గాని, మేనేజరు తర్వాత మేనేజరు లాగవుంది

రాత్రి తిరిగి వస్తున్నప్పుడు కార్లో ముందు సీట్లో మేనేజరూ అతని లేడీ స్టెనో

కూర్చొన్నారు. వెనక సీట్లో ఒక్కర్తే తను. మేనేజరు తనని యింటి దాకా దిగబెట్టలేదు దార్లో దింపేసి "ఇక్కడినుంచీ నీకు బస్సు దొరుకుతుంది, నే నీమెను వాళ్ళ ఇంటికి దిగబెట్టాలి" అన్నాడు అసూయతో ఒళ్ళు మండిపోయింది శారదకు

మర్నాడు ప్రొద్దునే ఆమె తండ్రితో చెప్పింది తానా ఫేక్టరీలో ఉద్యోగం మానేస్తాననీ, బేంకులో ఉద్యోగం వేయించమని భర్తతో చెప్పమనీను ఆమె హృదయ పరివర్తనానికి అ చ్యు త రా మా రా వు ఆశ్చర్యపడ్డాడు అల్లుడితో చెప్పాడు అతడు మరీ ఆశ్చర్యపడ్డాడు ఆమెకు బేంకులో ఉద్యోగం వేయించాడు శారద ఫేక్టరీలో మానేసి బేంకులో చేరింది భర్త దగ్గిరకి వెళ్ళిపోయింది భర్త ఆమె గత చరిత్ర నంతా మరచిపోయి విశాలహృదయంతో స్వీకరించాడు పాపం! అతను మాత్రం ఏంచేస్తాడు? ముప్ఫైఆరేళ్ళ దాకా పెళ్ళికాక పెళ్లాం కోసం మొహం వాచిపోయి ఉన్నాడు దొరికిన పెళ్లాన్ని ఎలాగో ఒకలాగ ఏలుకోవాలి తప్ప ఆమెను కూడా కాలదన్నుకొంటే ఎలాగ? ఇంతకీ తను మాత్రం ఇంతకాలం మహానీతిగా నడుచుకొన్నాడా ఏం? ఎలాగైతేనేం, పరిస్థితి చక్కబడింది అచ్యుతరామారావు పెద్దకొడుకు దగ్గరకి ఢిల్లీ వెళ్ళిపోయాడు

ఢిల్లీ వెళ్తూనే జబ్బుపడిపోయాడు అచ్యుతరామారావు. కోలుకొన్నాడు కాని చాలా నీరసపడిపోయాడు జబ్బుకన్నా, వస్తూనే జబ్బు పడ్డ తనను గురించి విసుక్కొంటూ గొణుక్కొంటున్న పెద్దకోడలు అతణ్ణి ఎక్కువ క్రుంగదీసింది. పెద్దకొడుకు పిసినారి, భార్యా విధేయుడు అని అతనికి తెలుసును మనస్ఫూర్తిగా అతనికి పెద్దకొడు కింట్లో ఉండాలని లేదు. కాని ఇంకెక్కడుంటాడు?

నిశ్చింతగా కాలుమీద కాలు వేసుకొని వార్ధక్యాన్ని గడపాలని కలలు కన్నాడు. అవి అసత్యములయాయి జీవితంలో తానను కొన్నట్లు ఒక్కటీ జరగలేదు అయినా అతను విచారించలేదు తన కర్తవ్యాన్ని తాను చేశాడు ఆ పైన దైవేచ్ఛ ఇలా ఉంటే తానేం చెయ్యగలడు?

అతనిలో నైరాశ్యం కలిగింది ఒక్క తన వ్యక్తిగత జీవితం గురించి కాదా నైరాశ్యం. మొత్తం మానవజాతి మీద అతనికి విశ్వాసం పోయింది ప్రపంచంలో మనిషికీ మనిషికీ, తల్లిదండ్రులకూ బిడ్డలకూ, భార్యకూ భర్తకూ ఉన్న అనుబంధం నేటి కాలంలో ఎంత క్షీణించింది! అని అతను వాపోయాడు నిస్సారమైన జీవితంలో నుంచి శూన్యమైన మరణం కొరకు ప్రతీక్షించసాగాడు వార్ధక్య చరమదశలో అచ్యుతరామారావు